తాగునీటి వెతలు!

- విస్తరించిన 86,87 వార్డులు
- నగరీకరణతో భారీగా వెలసిన అపార్ట్‌మెంట్‌లు
- పెరిగిన జనసాంద్రత
- ప్రతిపాదనల్లోనే కొత్త మంచినీటి పథకం
- త్వరితగతిన నిర్మించాలని వేడుకోలు



బహుళ అంతస్తులతో కూర్మన్నపాలెం ప్రాంతం



అంతంతమాత్రంగా వస్తున్న కుళాయి నీరుపడుతున్న వృద్ధురాలు



కణితి హైస్కూల్లోని వాటర్ ట్యాంక్

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86,87 వార్డులు బాగా విస్తరించాయి. ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం వచ్చిన వారితో కిక్కిరిసిపోయాయి. అపార్ట్‌మెంట్‌లు, ఇళ్లు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయాయి. జనసాంద్రత కూడా అదే స్థాయిలో పెరిగింది. దీంతో తాగునీటి సమస్య మొదలైంది. కూర్మన్నపాలెం ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు మరో 12ఎంఎల్‌డీ ప్రాజెక్టు నిర్మించాలని చేసిన ప్రతిపాదన ఇంకా ప్రణాళిక దశలోనే ఉంది. అది ఎప్పుడు అమల్లోకి వస్తుందో క్లారిటీ ఇవ్వకపోవడంతో తమకు తాగునీటి కష్టాలు ఇంకా ఎన్నాళ్లు అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి

పల్లెటూరుగా ఉన్న కూర్మన్నపాలెంలో భారీభవంతులు, అపార్టుమెంట్‌లు, వాణిజ్యసముదాయాలు వెలిశాయి. జనాభా విపరీతంగా పెరిగిపోయింది. దీంతో సిద్ధార్థనగర్‌లో నిర్మించిన 12ఎంఎల్‌డీ మంచినీటి పథకం ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు ప్రజలకు సరిపోవడం లేదు. ప్రధానంగా 86,87 వార్డుల్లో పెరిగిపోయిన అపార్టుమెంట్‌లకు బల్క్‌గా వాటర్ అందిస్తుండడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. రెండు వార్డుల్లోని వివిధ కాలనీలకు 6882 కుళాయిల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఇవిగాక 364 సెమీ బల్క్ కుళాయిలు, మూడు బల్క్ కుళాయిలకు నీటి సరఫరా జరుగుతందని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వ లెక్కల ప్రకారం మనిషికి 125 లీటర్ల చొప్పున నలుగురికి మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఒకే ఇంట్లో ఎక్కువ మంది కుటుంబ సభ్యులు ఉండడం, అనధికారిక నివాసాలు ఉండడంతో ఈ నీరు సరిపోవడం లేదు.వాస్తవానికి ప్రస్తుతం ఉన్న 12ఎంఎల్‌డీ పథకంలో నీటిని శుభ్రం చేస్తే 8 ఎంఎల్‌డీ నీరు మాత్రమే ప్రజలకు అందుతుంది. మిగిలిన నాలుగు ఎంఎల్‌డీల నీరు వేస్టు కింద పోతుంది.



రాజీవ్‌నగర్‌లోని వాటర్ ట్యాంక్

ప్రస్తుతం సరఫరా ఇలా

87వ వార్డు కణితి హైస్కూల్లోని వాటర్ ట్యాంక్ ద్వారా 250 కేఎల్‌డీల నీరు సరఫరా చేస్తున్నారు. అలాగే 86వ వార్డులో నాలుగు 10 కేఎల్‌డీలు, రెండు 150 కేఎల్‌డీలు, ఒక 450 కేఎల్‌డీ, మరో 500 కేఎల్‌డీ ద్వారా ప్రజలకు నీరు అందిస్తున్నారు. అయితే ఈ నీరు ఏమూలకు చాలడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వేసవిలో తాగునీటికోసం పడరానికి పాట్లు పడుతున్నారు.

తాగునీటి సరఫరా సమయం పెంచాలని వినతులు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ప్రాజెక్టు ఉన్న సిద్ధార్థనగర్‌లోనే పరో పథకం నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. సుమారు రూ.10 కోట్లు అవసరమవుతాయని ఇంజినీరింగ్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పథకం నిర్మించి దాదాపు 25 సంవత్సరాలు పూరి అయినట్టు రికార్డులు చెబుతున్నాయి. మోటార్లు , పైపులు పాతబడిపోవడం వల్ల ఇవి కూడా మార్చవలసి ఉంటుందని అధికారులు అంటున్నారు.

మరో ప్రాజెక్టు అవసరం



కూర్మన్నపాలెంలో జనాభా పెరిగింది. దాని ప్రకారం మరో 12ఎంఎల్‌డీ సామర్థ్యం గల మంచినీటి పథకం అవసరముంది. ప్రాజెక్టు రిపోర్టు తయారు కావాల్సి ఉంది. అది పూర్తి చేసి ప్రతిపాదనలు రూపొందించడం తదితర అంశాలను ముందుకు తీసుకువెళ్తాం. కొత్తపథకం వస్తే ప్రజలకు నిరంతరం తాగునీరు అందించ వచ్చు.

– పి.శ్రీనివాస ప్రసాద్, ఈఈ నీటి సరఫరావిభాగం, జీవీఎంసీ

తాగునీటికి తిప్పలు



ప్రస్తుతం కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీరు సరిపోవడం లేదు. వేసవిలో అయితే ధార కూడా తక్కువ వస్తుంది. నీటి సమస్య వల్ల బయట నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. పెరిగిన జనాభాను దృష్టిలో పెట్టుకుని మరో మంచినీటి ప్రాజెక్టు నిర్మించి తాగునీటి కష్టాలు తీర్చాలి.

– పి.వెంకటరమణి, గణేష్‌నగర్, వడ్లపూడి.

సమయం పెంచాలి



మంచినీటి సరఫరా అందరికీ అందాలంటే అవసరమైన ప్రాజెక్టులు నిర్మించాలి. ఇప్పటికే జనాభా విపరీతంగా పెరిగిపోయింది. 25 ఏళ్ల కింట నిర్మించిన ప్రాజెక్టు ద్వారా నీరు సరఫరా చేస్తే ఎక్కడ సరిపోతుంది. అధికారులు, పాలకులు ప్రజలను ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తక్షణమే కొత్తమంచినీటి పథకం నిర్మించాలి. కుళాయిలు ఇస్తున్న సమయం పెంచాలి. – సీరం సీనమ్మ, కణితి

క్లుప్తంగా

విద్యార్థులకు ముగిసిన టైలరింగ్ శిక్షణ



శిక్షణ పొందిన విద్యార్థులు

గాజువాక: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన కుట్టుమిషన్ శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఒకేషనల్ విభాగం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21న ప్రారంభమైన ఈ శిక్షణా కార్యక్రమం పదిరోజుల పాటు సాగింది. 31 మంది విద్యార్థులు తర్ఫీదు పొందారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విజయ ప్రశాంతి తెలిపారు. భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలకు ఈ శిక్షణ దోహదం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒకేషనల్ ఉపాధ్యాయురాలు భారతి, కో ఆర్డినేటర్ మెట్ట సుధాకర్ భట్లు, జీసీడీవో గుమ్మడి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ



ఆహార పొట్లాలు అందిస్తున్న పారాయణ సేవా సమితి ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పాత అగనంపూడి సత్రం కూడలిలో బొర్రమాంబ పారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేదలు, అనాథలకు ఆహార పొట్లాలు అందించారు. ప్రతీ మంగళవారం పారాయణ సేవా సమితి సేవా కార్యక్రమం చేపడుతుంది. పారాయణసేవా సమితి ప్రతినిధి తలారి లలిత కుమారి, సన్యాసమ్మ, నిహారిక చేతుల మీదుగా వీటిని అందించారు.

తొక్కుడు బిళ్ల ఆడేద్దాం



తొక్కుడు బిళ్ల ఆడుతున్న మహిళలు

పెదగంట్యాడ: తొక్కుడు బిళ్ల.. ఈ ఆటంటే తెలియని వారు ఉండరు. బాల్యంలో తోటి స్నేహితులతో కలసి ఆడిన ఈ ఆటను చిన్నారులు, మహిళలు మళ్లీ ఆడేస్తూ సందడి చేస్తున్నారు.దసరా పండగను పురస్కరించుకొని ఓ సంస్థ ఈ ఆటలను మళ్లీ మహిళలతో ఆడిస్తోంది. విజేతలకు బహుమతులు అందిస్తోంది. వారంతా మళ్లీ చిన్నతనంలోకి వెళ్లి పోతున్నారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో మహిళలంతా మళ్లీ వీధుల్లోకి వస్తున్నారు. సరదాగా ఆడేస్తూ బాల్యంలో వారు చేసిన అల్లరిని గుర్తు చేసుకుంటున్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగికి హిందీలో డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి గోపాల్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అధికారి గోపాల్ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. స్టీల్‌ప్లాంట్ రాజభాష విభాగంలో సీనియర్ అడ్మిన్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గోపాల్ బామ్‌సెఫ్ సంస్థ ఆధ్వర్యంలో బహుజన్ భారత్ ఎడిటర్, ప్రముఖ దళిత రచయిత మోహన్‌దాస్ నైమిష్‌రేపై అధ్యయనం చేశారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన ఆర్ట్స్ విభాగం మాజీ డీన్ ప్రొఫెసర్ షకీల ఖనం గైడెన్స్‌లో ' మోహన్‌దాస్ నైమిష్‌రే కె కథ సాహిత్య మే జాన్వాడి విమర్శ్ ' అనే అంశంపై థీసిస్ అందజేశారు. మంగళవారం హైదరాబాద్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో జరిగిన 26వ కాన్వొకేషన్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, న్యూఢిల్లీ ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమ కంజిలాల్ చేతుల మీదుగా గోపాల్ డాక్టరేట్ అందుకున్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి ,నాయకులు

పెదగంట్యాడ: మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తే పేద, మధ్యతరగతి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతారని వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పెదగంట్యాడ ఫైర్ స్టేషన్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా దేవన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను అడ్డుకుంటామన్నారు. పార్టీ ఎస్సీసెల్ నాయకుడు మార్టుపూడి పరదేశి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గంట్యాడ గురుమూర్తి, గొందేశి మహేశ్వరరెడ్డి, కొయ్య భారతి, రోజారాణి, గొందేశి వెంకటరమణారెడ్డి, మంత్రి శంకరనారాయణ, కటికల కల్పన, సంపంగి ఈశ్వరరావు, కాకినాడ పెంటారావు, వెంకటేష్, డాక్టర్ ఎస్ రాజారావు, పిట్టా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

పెదగంట్యాడ: అదానీ సిమెంట్ ఫ్యాక్టరీకి ప్రభుత్వం మంజూరు చేసిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో రిక్షా కాలనీ, రామచంద్రనగర్, స్వతంత్రనగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. సీపీఎం జోన్ కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ ఇప్పటికే ఈ ప్రాంత ప్రజలు గంగవరం పోర్టు కాలుష్యంతో పాటు డంపింగ్ యార్డ్ నుంచే వచ్చే దుర్వాసనతో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు సిమెంట్ ఫ్యాక్టరీ పెడితే మరిన్ని సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. వెంటనే సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రమణ, వెంకట్రావు, త్రినాథస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో స్కూటీ దగ్ధం



దగ్ధమైన స్కూటీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో క్వార్టర్ ముందు పార్క్ చేసిన బైక్ దగ్ధమైంది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్-5లోని 505 డి క్వార్టర్‌లో స్టీల్‌ప్లాంట్ సీనియర్ మేనేజర్ పి. సుందరరావు నివాసముంటున్నారు. సోమవారం రాత్రి క్వార్టర్ ముందు స్కూటీ పార్క్ చేసి ఇంట్లోకి వెళ్లిపోయారు. అర్ధరాత్రి దాటిన తర్వాత కింద క్వార్టర్‌కు చెందిన వ్యక్తి స్కూటీ కాలిపోవడం గమనించి సుందరరావుకు సమాచారం ఇచ్చారు. వారు ఫైర్ విభాగానికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే స్కూటీ పూర్తిగా కాలిపోయింది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్మిక నాయకుడికి ఘన సత్కారం


ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ విభాగం నుంచి పదవీ విరమణ చేస్తున్న కార్మిక నాయకుడు జెర్రిపోతుల ముత్యాలును మంగళవారం విభాగం కాన్ఫరెన్స్ హాలులో ఘనంగా సత్కరించారు. విభాగం జనరల్ మేనేజర్ ఎం.వి.ఎస్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ముత్యాలు సేవలను కొనియాడారు. ఉద్యోగిగా, కార్మిక నాయకుడిగా అందరి మన్ననలు పొందారన్నారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు కొమ్ము ప్రసాద్ , బి.వి. కన్నబాబు, శివరామకృష్ణ, విభాగం అధికారులు నాయక్, బి. శ్రీను, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలు దంపతులను సత్కరిస్తున్న అధికారులు, నాయకులు

వరప్రదాయినీ నమోస్తుతే

దుర్గాదేవిగా అమ్మవారికి విశేష పూజలు



బాల చెరువులో దుర్గాదేవిగా అమ్మవారు



దిబ్బపాలెంలో మహిళలు వేసినముగ్గులు



అగనంపూడి దుర్గాలమ్మ ఆలయంలో దుర్గాదేవి రూపంలో అలంకరణ

లెంలో ఇసరపు వెంకటరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు మద్ది శ్రీనివాసరావు, ఎంపీరెడ్డి, పిట్ట చిట్టిబాబు, కర్రి అప్పారావు, కర్రి మాణిక్యం, షేక్ నన్నా, కనకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్‌బోర్డు కాలనీలోని వాసవీ కన్యకాపరమేశ్వరి పంచాయతన దేవాలయంలో వాసవీమాతను దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సామూహిక కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.
- బాలచెరువు ఉమారామలింగేశ్వర ఆలయంలో కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదుర్గ



ఇసరపువానిపాలెంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

అమ్మవారిని ఆలయ అర్చకుడు వాసదేవశర్మ దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

- స్థానిక సమతానగర్‌లో షిర్డీ సాయి శాంతిధామంలో విజయదశమి, 107వ ఆరాధన మహోత్సవాలు సందర్భంగా ఆలయాన్ని కమిటీ చైర్మన్ సత్యంబాబు, కార్యదర్శి రవిశేఖర్ ఆధ్వర్యంలో గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దుర్గాదేవి రూపంలో...

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారు మంగళవారం దుర్గాదేవి రూపంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి నిమ్మకాయలతో అలంకరించి ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.బొర్రమాంబ పారాయణసేవా సమితి విష్ణు, లలిత సహస్ర పారాయణం చేశారు.

- దిబ్బపాలెంలోని ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంగోళి పోటీలు నిర్వహించారు. దిబ్బపాలెం, బొర్రమ్మపాలెం, దానబోయినపాలెం, పెద్దినాయుడుపాలెం గ్రామాల మహిళలు పోటీల్లో పాల్గొని అమ్మవార్ని వివిధ రూపాల్లో ముగ్గుల్లో బంధించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందించారు. నిర్వాహకులు యలమంచిలి అప్పారావు, ఈగల నరసింగరావు, ఇల్లపు జువ్వాలు, కృష్ణవేణి పాల్గొన్నారు.



వాసవీమాత ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు



సాయిబాబా ఆలయంలో గాజులతో ప్రత్యేక అలంకరణ


త్రిశక్తి అమ్మవార్లకు విశేష పూజలు



మహాదుర్గాదేవిగా మహాదుర్గ



బ్రహ్మచారిణిగా మహా సరస్వతి



విజయలక్ష్మిదేవిగా మహాలక్ష్మి

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. తొమ్మిదో రోజు మంగళవారం మహాదుర్గ అమ్మవారు ఎరుపు వర్ణం చీరలో మహాదుర్గాదేవిగా, మహాలక్ష్మి అమ్మవారు గులాబి వర్ణం చీరలో , విజయలక్ష్మిగా, మహాసరస్వతి అమ్మవారు కాషాయ వర్ణం చీరలో బ్రహ్మాచారిణి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు సహస్ర గులాభి పుష్పార్చన చేశారు. సాయంత్రం ఉయ్యాల సేవ నిర్వహించారు. ఉక్కునగరం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తుల పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చిరు వ్యాపారులకు న్యాయం చేయాలి

గాజువాక: రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకొంటున్న స్ట్రీట్ వెండర్, తోపుడు బళ్లను జీవీఎంసీ అధికారులు తొలగించడం అన్యాయమని గాజువాక హాకర్స్ సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. చిరు వ్యాపారులకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. సంఘం నాయకులు ఎ.జె.స్టాలిన్, కసిరెడ్డి సత్యనారాయణ తదితరులు వ్యాపారుల స్థితిగతులను వివరించారు. ఎక్కడివారికి అక్కడే వ్యాపారం కొనసాగించేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. వినతి పత్రం సమర్పించినవారిలో నాయకులు పప్పు అప్పారావు, ముత్తా అప్పారావు, మోహన్, ఎస్.దేముడు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే పల్లాకు వినతి పత్రం అందజేస్తున్న హాకర్స్ సంఘం నాయకులు